# మనిషి

-పాలగిరి విశ్వప్రసాద్

అది ఓ మాదిరి ఖరీదైన ఆస్పత్రే- అయినా సెంటు వాసనేం కొట్టలే. ఆ ఆస్పత్రి, ఆస్పత్రి కంపే కొడ్తాంది- నానా రకాల మందులూ కలగలిపిన వాసన. మందుల వాసనా, ఆస్పత్రి వాతావరణం- విధిలేక వారం రోజుల్నుండీ భరించాల్సొస్తోంది రాంరెడ్డికి.

తండ్రి- 'శవం' మాదిరే ఆస్పత్రి మంచంలో పడివున్నాడు. అప్పటికి మూడ్రోజుల్నుంచీ స్పృహలో లేదు.



అసలు జబ్బేందో రాంరెడ్డికి తెలియదు. సామాన్యమైన మనుషులకు డాక్టర్లు జబ్బుల పేర్లూ, లక్షణాలూ చెప్పరు. కనీసం తీసుకోవలసిన జాగ్రత్తలైనా చెప్పరు. రాంరెడ్డికి తన తండ్రికొచ్చిన జబ్బేందో తెలుసుకోవాలనుంది. డాక్టర్ల నడగడానికి భయం. అక్కడికీ ఉండబట్టలేక వొచ్చిన రెండో రోజే డ్యూటీ చేస్తున్న నర్సమ్మ నడిగినాడు. ఆమె నోరన్నా తెరవలేదు. 'చదువు సంధ్యలేనోళ్ళకు కడా జబ్బుల పేర్లెందుకో! ఏ మర్థమవుతుందో!' అన్నట్లు చూసి వెళ్ళిపోయింది. 'ఆమెకైనా తెలుసో! లేదో' అనుకున్నాడు రాంరెడ్డి.

తండ్రేమో కళ్ళైనా తెరిచి చూడటం లేదు- డబ్బేమో మంచినీళ్ళ ప్రాయమైంది. రాంరెడ్డికి దిక్కు తెలియడం లేదు. అడ్డపంచ ప్రక్కకు జరిపి డ్రాయర్ జేబులోంచి డబ్బును తడుముకున్నాడు- భద్రంగానే వుంది.

ఒకసారి తను తొడుక్కున్న గుడ్డల వంక చూసుకున్నాడు. లేత నీలం రంగు చొక్కా, తెల్లటి పంచ మాసి మట్టి గొట్టక పోయున్నాయి. అక్కడక్కడ ఏవో నూనె మరకల్లాగా కూడా కనిపిస్తాందయ్. మందుల మరక లేవో అయి వుంటయ్. చొక్కా, పంచ రెండూ పాలిష్టర్‌వే. తన అవతారం చూస్తే అవి తనవి గాక ఎవరో దానమిచ్చినట్లు వుంది. ఒక జత ఇక్కడి కొచ్చేసరికే ప్రయాణంలో నలిగి, మాసిపోయింది. రెండో జత ఒంటి మీద ఇవుదున్నవి- ఈ స్థితి కొచ్చినయ్.

'ఈ పొద్దు పూరి కాడ్నుంచి ఎవరోకరు వస్తారు. గుడ్డలూ, లెక్క తీస్కరావచ్చు' అనుకుని దృష్టిని తన గుడ్డల మీద నుండి తిరిగి తండ్రి మీదికి మళ్ళించి తండ్రి మొహంలోకి చూస్తూ కూర్చున్నాడు.

'ఈ ముసిలోడు తొందరగా సచ్చిపోతే బాగుండు' అనిపించింది. అనుకున్న మరుక్షణమే తన మనసులోని భావాలనెవరైనా పసిగట్టి, హత్యానేరం క్రింద ఉరిశిక్ష వేయిస్తారేమో అన్నంతగా భయపడినాడు. ఇక్కడ తప్పించుకున్నా నరకమనేది ఒకటుందనిపించి కంపించి పోయినాడు.

'ఛూ! అన్నీ పాపిష్టి ఆలోసెన్లొస్తాండయ్' అనుకుని, మనసును దిటవు చేసుకోవాలనుకుని, జేబులో డబ్బుతీసి లెక్క పెట్టుకుంటూ కూర్చున్నాడు. మూడు వేల పైచిలుకుంది. వారం నుంచీ దగ్గర దగ్గర నాలుగు వేలయిపోయిందనుకోగానే, మబ్బు కమ్మినట్లనిపించింది. కళ్ళు తిరిగి పడిపోతానేమో నన్పించి ప్రక్కనేవున్న మంచాన్ని పట్టుకుని

ఆసరా చేసుకున్నాడు.

పది కావొస్తున్నా ఉదయం నుంచీ ఏం తినింది లేదు. బయటికి పోయి టీ నీళ్ళన్నా కడుపులో పోసుకుందామని స్టూల్ మీద నుంచి లేచినాడు.

వాకిలి దగ్గిర అలికిడయింది. అటుచూస్తే నర్సమ్మలు. తెల్లటి చీరలు కట్టుకుని, నెత్తిన చిన్న కిరీటం లాగా తెల్లని బెత్తెడు వెడల్పున్న అట్ట ఒకటి గుండ్రంగా అమర్చుకుని, తెల్లటి పావురాళ్లా కువకువలాడ్తా లోపలి కొచ్చినారు.

వాళ్లలో ఒక పావురం రాంరెడ్డి దగ్గిర నిలబడింది. రాంరెడ్డి తండ్రిని ఆస్పత్రిలో జేర్చిన మొదటి మూడ్రోజులూ ఈ వార్డులోనే డ్యూటీ చేసిన షీలా. తర్వాత ఈ వార్డుకు రావడం లేదు.

"ఏం రెడ్డీ! ఎట్లుంది తండ్రిగారికి?" అంది.

"అట్నే ఉండాదమ్మయ్యా! రోంతన్నా గుణం కానాలె" అన్నాడు చాలా వినయంగా రాంరెడ్డి జవాబు మీద ఆమెకు దృష్టి లేదు.

నల్లరేగట్లో కాయకష్టం జేసిన బండ శరీరం మీద, మొద్దుబారిన గోళ్ళు చేసే చప్పుడు వినపడిందేమో! తెల్లపావురం– షీలా నర్సమ్మ– రెప్పపాటు కాలం అతను బరుక్కునే మోకాలి ప్రాంతం చూసి, తిరిగి అతని మొహం వైపు చూసింది. ఈ మధ్య కాలంలోనే ఆమె మొహంలో అసహ్యపు రేఖలీలా మాత్రంగా సున్నితంగా కదిలింది.

ఎడమ చేయి చూపుడు వేలితో తన కుడి రొమ్ము మీద సుతారంగా గీక్కుంటూ "నయమయితుందిలే, రెడ్డీ! బెంగెట్టుకోకు" అంది. 'దురద పుడితే గీరుకునే పద్ధతి ఇదీ' అని చూపించినట్లుంది.

మళ్ళీ రాంరెడ్డికి మాట్లాడే అవకాశమివ్వక, విసావిసా పోయి పావురాల గుంపులో కల్సిపోయింది.

రాంరెడ్డి దీర్ఘంగా నిట్టూర్చినాడు. 'బెంగెట్టుకోకు'– ఆ మాటనాల్సింది మనుషులు కాదు. డబ్బులు– డబ్బులొచ్చి ఆ మాట అంటే ఊరట కలుగుతుంది. ఆ డబ్బులైనా అప్పుగా కాదు. ఆకాశం నుంచి రాలిపడాలి. ఆ రకంగా గాక ఇంకెట్లొచ్చినా డబ్బును మోసే శక్తి తనకు లేదు. అప్పుల భారంతో ఇప్పటికే పదేండ్ల వయసు అదనంగా వచ్చినోడి మాదిరి కన్పిస్తున్నాడు.

అతను ఆస్పత్రి వరండాలో కొచ్చి నిలబడినాడు. ఖరీదైన నేల, గోడలు– ఆ భవనం ముందు వరండాలో తను దిష్టిబొమ్మ– అన్పించింది.

హాస్పిటల్ క్యాంటీన్ ఆ మూల శోభనపు పెళ్లికూతుర్లా వుంది– తన కళ్ళకు. పదార్థాలు కూడా అంతే రుచిగా వుంటాయి. కానీ తను తూగలేదు. వచ్చిన రోజే ఆ దెబ్బ రుచి చూసినాడు. మెల్లగా, దిగులుగా గేటు వైపు అడుగులు పడినయ్.

రాంరెడ్డి గేటు దాటి ఆస్పత్రి బయటికి వొచ్చినాడు. రాత్రి కురిసిన వాన తాలూకు రొంపి–– ఆస్పత్రి ఆవరణలో కానరాని రొంపి–– ఒక్క

రాంరెడ్డి దీర్ఘంగా నిట్టూర్చినాడు. 'బెంగెట్టుకోకు' ఆ మాటనాల్సింది మనుషులు కాదు. డబ్బులు, డబ్బులొచ్చి ఆ మాట అంటే ఊరట కలుగుతుంది. ఆ డబ్బులైనా అప్పుగా కాదు, ఆకాశం నుంచి రాలిపడాలి. ఆ రకంగా కాక ఇంకెట్లా వచ్చినా డబ్బును మోసే శక్తి తనకు లేదు. అప్పుల భారంతో ఇప్పటికే పదేండ్ల వయస్సు అదనంగా వచ్చినోడి మాదిరి కనిపిస్తున్నాడు. ఆ ఖరీదైన ఆస్పత్రిలో తనో దిష్టిబొమ్మ అనిపిస్తున్నాడు.

సారిగా ఒక రకమైన రొచ్చు వాసన ముక్కుపుటాలకు తగిలింది.

ఆ ఆస్పత్రి వాసనకన్నా ఇదే మేలనిపించింది రాంరెడ్డికి.

రోడ్డు కవతల వరుసగా పందిళ్ళు వేసిన మూడు టీ బంకులున్నాయి.

రోడ్డు మీద మన్ను, పేడ, నానా చెత్తంతా రాత్రి వానకు నాని, వాహనాల కిందపడి రొల్లు రొల్లుగా తయారయింది. కొంతమంది పాదచారులు చెప్పలున్నా కాళ్ళు ఎత్తెత్తి అతి జాగ్రత్తగా నడుస్తున్నారు.

రాంరెడ్డికి అదంతా ఏం పట్టినట్టు లేదు. వాహనాలను తప్పించుకొనే ఆత్రంలో రోడ్డు మీదున్న రొంపిని తన చెప్పల్లేని కాళ్ళతో కసాపిసా తొక్కుకుంటూ అవతలికి చేరి, ఒక టీ బంకు పందిరి కిందికి నడిచినాడు.

ఒక నిమిషం పరిసరాలను గమనిస్తూ నిలబడ్డాడు.

పల్లెరాల్లో ఎప్పుడో చేసి పెట్టిన బజ్జీలు, వడలు, చక్కిలాలు వున్నాయి. వాటి మీద వాలే ఈగల్ని టీ బంకు ఆసామి అప్పుడప్పుడూ గుడ్డతో తోల్తున్నా, తిరిగి అవి యథాస్థానానికి రావడానికి ఎంతోసేపు పట్టడంలేదు.

బంకులో పెద్దగా సందడి లేదు. ఇద్దరు ముగ్గురు మగవాళ్ళున్నారు. ఎవరో ఆడకూతురు – పాతికేళ్ళ వదుము, చేతిలో సత్తు చెంబు పట్టుకుని టీ బంకు వాన్ని బతిమాల్తాంది. "అన్నన్నా! ఈ పొద్దుటికి ఒక్కసారి నాలుగు టీ పోసి, నాలుగు వడలియ్యన్నా! పిల్లోల్లిద్దర్కీ పొద్దన్నుంచీ ఏం పెట్టలే. నీకు పున్నెముంటాది. రేపే పాటికిస్తా" అంటాంది.

రాంరెడ్డి రెండు వడలు తిని టీ తాగుదామనుకున్నాడు. కానీ ఏమనుకున్నాడో మనసు మార్చుకుని "ఒక కాఫీ ఇయ్యన్నా!" అడిగినాడు. తనకు టీ అలవాటు పెద్దగా లేదు. పల్లెల్లో కాఫీ కామకోడమే అలవాటు. టీ తాగినా తాగినట్టుండదు.

టీ బంకు వాడు అటూ ఇటూ తిరుగుతా అందర్కీ అన్నీ అందిస్తున్నాడుగానీ, ఆ వదుమను పట్టించుకోవడం లేదు. ఆమె బెంచీ మీద నుంచి లేచి వాని కడ్డం పడింది. "రాములన్నా! నీకు పున్నెముంటుంది. సచ్చినీ కడుపున పుడ్తా" గడ్డం పట్టుకోబోయింది.

ఆ రాములన్న చెయ్యి విసిరి కొట్టి "నా దగ్గిర నకరాలు జెయ్యొద్దు. ముందు నా కియ్యాల్సిన ఇరవై రూపాయిలియ్యి. నా దగ్గర అప్ప పెట్టేదీ – సంపాదిచ్చిన దాంతోనేమో శావలూ రొయ్యలూ దినేదీ, నీకత నాకు తెల్దనుకున్నావ్? రాత్రొచ్చిన డబ్బేం జేసినవ్? ఆ నర్సిగాడు రాత్రి నీ దగ్గిరకనే వొచ్చెనే?"

ఉన్నెట్టుండి ఆ యువతి రౌద్రాకారం దాల్చింది. చేతిలోని చెంబు అక్కడ పెట్టి, కొప్పు ముడేసుకుంటూ "థూ! ఆ నర్సిగాడు మడిశా? వాడు డబ్బులిచ్చే నా కొడుకేనా! నాకు తెల్సు వాని కత. అయినా ఆశ సావక సరే అంటి. లంజకొడుకు! అసర సందేల వాని పీనిగెల్లిపోను. నా పిల్లోళ్ళ ఉసురు తగిలి పురుగులు పడిపోతాడు" అక్కసుగా ఆకాశంలోకి మెటికలిరిచింది.

ఆ యువతి మాటలు వినేసరికి రాంరెడ్డికి తన పెద్దకూతురు, ఆ వెంటనే రెండో కూతురూ జ్ఞాపకమొచ్చినారు. వెనువెంటనే మళ్ళీ తన్ను తాను తిట్టుకున్నాడు.

అక్కడ కాఫీ తాగాలనిపించలేదు. ప్రక్క బంకులోకి పోదామనుకున్నాడు. అక్కడైనా – తను రాక ముందు ఇట్లాంటి వదుములొచ్చి కాఫీలు, టీలు తాగి వుండరా? తన పిచ్చిగానీ! రాంరెడ్డి అంత దిగులులోను చిన్నగా నవ్వుకున్నాడు.

టీ బంకు వాడు "కాఫీ" అని గ్లాసు అతని చేతిలో పెట్టినాడు.

రాంరెడ్డి చొక్కా జేబులో చూసుకుంటే ఒక రూపాయి బిళ్ళ, మిగిలినవి పది రూపాయిల నోట్లు ఒద్దికగా వుండాయి.

"టీ తాగింటే బాగుండు – ఆడికి రూపాయి బిళ్ల సరిపోయ్యేది – ఇప్పుడు కాఫీకి రెండ్రూపాయిలు – పది రూపాయల నోటు మార్చాల" రాంరెడ్డికి మనసు చివుక్కుమంది. కాఫీ వెనక్కిచ్చి టీ వెయ్యమనడాకి సిగ్గు, బిడియం లాంటివేవో అడ్డొచ్చి, తప్పనిసరిగా కాఫీ తాగినాడు.

ప్రాణాన్ని గుప్పిట్లోకి తీసుకుని దానమిచ్చినట్టు విలవిల్లాడిపోతూ, అతి వినయంగా పది రూపాయల నోటును అందిచ్చినాడు – రోజులు

గుడుస్తా, జేబులో డబ్బు అయిపోయే కొద్ది రూపాయి ఖర్చు పెట్టాలన్నా అతనికి ప్రాణం ఊసూరంటాంది – టీ బంకువాడు నోటును తీసుకుని విసురుగా పెట్టెలో వేసి అయిదు, రెండు రూపాయిలు నోట్లు చేతిలో పెట్టినాడు. రెండు రూపాయిల నోటు తన బతుకు లాగే చినికిపోయి "ఇప్పుడా... అప్పుడా" అని వుంది.

రాంరెడ్డి బిడియంగా టీ బంకు వాన్ని మాస్తా "ఈ రెండ్రూపాయిలు..."

అతని మాట పూర్తికాకుండానే టీ బంకువాడు "సెల్లుతుం పోస్తా!" అన్నాడు.

రాంరెడ్డి మెల్లగా బంకు బయటికి నడిచినాడు. వెనకల, బంకులో ఆ పాతికేళ్ళ పడుచు బతిమ మాల్తానే వుంది. "అన్నన్నా! కాంక్రీటు పనికి పోదామంటే మునురు పట్టి పనులుజరగడంలే. దయసూపన్నా! రేపేపాటికిస్తా! నాలుగు టీ పొయ్యన్నా" అంటాంది.

రాంరెడ్డి తమ గది దగ్గరికి వచ్చేసరికి తమ ప్రక్క గదిలో వుండే సిద్దారెడ్డి పెట్టే బేడా సర్దుకుని జబ్బుతో వున్న తన తల్లితో ఎదురైనాడు. ప్రక్కన ఎవరో రోజా కనపడని కొత్త మనిషి వున్నాడు. బహుశా వాళ్ళ వూరి నుంచి వచ్చినాడేమో!

ఆస్పత్రి ఖాళీ చేసి వెళ్ళిపోతున్నారని, వాళ్ళు వెళ్ళే పద్ధతే చెబుతాంది.

"ఏం సిద్దారెడ్డన్నా! పోతాండారు?" రాంరెడ్డి అడగడంలో యేదో భయముంది.

"పోతాండం, రాంరెడ్డన్నా! పోక ఏం జేయాల పెద్ద ఐదార్రోజులుంటే – బాగయితుందని వొచ్చినాం. రెండు వారాలైంది. ఈడుండి రోజా మాల్లు మాల్లు బిల్లు కట్టాలంటే యాడయితాది? మాదీ అంతంత సంసారమే మల్ల. పోతండం – ఆ వల్ల ఎట్ట రాసి పెట్టుంటే అట్టయితాది" సిద్దారెడ్డి మాటల్లో దిగులో, ఏడుపో యేదోవుంది. అతని తల్లి కూడా ఈ బతుకు మీదున్న చివరి ఆశ వదులుకుని, మృత్యుముఖంలోకి నడిచిపోతున్న ఎముకల గూడులా వుంది.

వాళ్ళది పులివెందుల దిక్కు పల్లెంట. రాంరెడ్డిది ఆ పక్క తాలూకానే – ఒకే ప్రాంతం నుంచి వచ్చిన అభిమానమేమో – రాంరెడ్డికి తమ వాళ్ళెవరో తోడు వుండారనే భావన వుండేది.

ఇప్పుడు వాళ్ళు వెళ్ళిపోతున్నారనగానే రాంరెడ్డికి ఒక్కసారిగా ఒళ్ళంతా నిస్సత్తువైపోయింది. తనను అదృశ్య హస్తమేదో ఎడార్లోకి విసిరేసి నట్టనిపించి, మనసంతా బాధతో పూడుకుని పోయి నోట మాట రాలే.

"పోయొస్తం రాంరెడ్డన్నా" భుజం మీద సెయ్యేసి సిద్దారెడ్డి వాళ్ళు కదిలినారు. రాంరెడ్డి కూడా వాళ్ళ వెనకే తిరిగి ఆస్పత్రి గేటు వరకు వచ్చి వాళ్ళు రిక్షా లెక్కే దాకా మాసి వెనక్కి కదిలినాడు.

తమ గది కొచ్చేసరికి తండ్రిలో ఏదో మార్పు కన్పిస్తోంది. భారంగా ఎగశ్వాస పీలుస్తున్నాడు. నిర్జీవంగా వుండిన మనిషి బలవంతం మీద మెల్లగా కదులుతున్నాడు. కడుపు వాచినట్టు కనపడతాంది.

రాంరెడ్డికి ఏం చేయాలో తెలియక భయంతో "నర్సమ్మా!" అరిచినాడు.

నర్సు తేలిగ్గానే వొచ్చింది "ఏమయ్యా?" అంటూ.

రాంరెడ్డి తండ్రి వైపు చేయి చూపినాడు. అప్పటికే రోగిని గమనించిన నర్సులో కూడా ఆందోళన తొంగిచూసింది. అటు ఇటు కదిపిచూసింది. కడుపు మీద తట్టి చూసింది. తండ్రి శరీరంలోకి ఎక్కిస్తున్న సీసాల్లోని నీరు, శరీరంలోకి పోతూదో లేదో చూసింది. ఏమీ అర్థం కాక పరుగెత్తుకుంటూ వెళ్ళిపోయింది.

వెళ్ళిన నర్సు, డాక్టర్‌ను వెంట బెట్టుకుని వచ్చింది. డాక్టర్ కడుపు వొత్తి చూసినాడు. తన తండ్రి అడ్డపంచను రెండు అంచులూ అటూ ఇటూ విడదీసినాడు.

తండ్రి మర్మాయవానికి అమర్చబడిన రబ్బరు పరికరం సక్రమంగానే వుంది.

ఆ పరికరం మర్మాయవానికి అతుక్కుని – కదలికలకు వూడి రాకుండా వుండడానికి అక్కడ నాలుగైదు క్లిప్పులు అమర్చివుంటారు.

కానీ... కానీ... అందులో ఒక క్లిప్పు – ఆ రబ్బరు పరికరాన్ని అంటిపెట్టుకోక – ఆ పరికరం నుంచి క్రిందికి అమర్చిన సన్నని రబ్బరు గొట్టానికి తగిలించబడివుంది.

ఆ క్లిప్పు వత్తిడికి గొట్టం రంధ్రం మూసుకుపోయినట్టుంది... అందుకే పొట్ట వుబ్బింది. మూత్రాశయం నుంచి మూత్రం బయటికి పోక తండ్రి పొట్ట వుబ్బింది.

**తన తండ్రికి ఆపరేషన్ చేయడానికి ఇప్పుడున్న స్థితిలో కుదర్దు. ముందు ఆ శరీరాన్ని మామూలు స్థితికి తెచ్చి, లోపల యంత్రాలన్నీ సరిగా పని చేసేటప్పుడు ఆపరేషన్ చేస్తారు. అంత దాక ఎంత డబ్బో! తను నర్సునూ, డాక్టర్నూ పిలవకుండా వుండి వుంటే... తండ్రి చనిపోయేవాడు. చనిపోయుంటే బావుండు, తను నర్సును పిలవకుండా వుంటే బావుండు. రాంరెడ్డి ఉలిక్కిపడినాడు, కానీ మొదటిసారి ఆలోచన వచ్చినప్పుడం తగా భయపడలేదు.**

ఎలా జరిగిందిది?.. ఎవరి నిర్లక్ష్యం... ఉదయం అన్నీ అమర్చింది ఈ నర్సే...

వేలకు వేలు తీసుకుంటూ వుండి కూడా పనులు చేయడంలో నిర్లక్ష్యం... ఫలితం ఎవరనుభవించాలి?

రాంరెడ్డికి అడగాలనే వుంది. నర్సునూ, డాక్టర్నూ నిలదీయాలనే వుంది. కానీ ఏదో అడ్డం పడుతోంది... చదువు సంధ్యలేని తనం. తన తెలివి తేటలు చాలవేమోననే బెరుకు – ఇక్కడ తన వాళ్ళెవరూ లేని ఒంటరిననే భయం.. ఏదో, ఇంకేదో అడ్డం పడి అతనేమీ అడగలేదు.

డాక్టర్ వెంటనే ఆ గొట్టానికి తగిలించబడిన క్లిప్పను తీసి – ఆ పరికరానికి అమర్చి, గొట్టం నొక్కుకుపోయినచోట చేత్తో వొత్తి రంధ్రాన్ని సరి జేసినాడు.

డాక్టర్ మొహంలో కోపం చోటు చేసుకుంటూ వుంది. అంతా సరిచేసి లేచి, ఇంగ్లీషులో ఏదో మాట్లాడినాడు. ఆ మాటల్లో కోపం వుంది. ఆ మాటలు రాంరెడ్డికి అర్థం కాకపోయినా, నర్సును దండిస్తున్నాడనేది అర్థమయింది.

ఏదో ఇంజక్షనిచ్చి డాక్టర్ వెళ్ళబోతుండగా రాంరెడ్డి భయం భయంగా అడిగినాడు – "ఏమైంది సార్? ఇంకా ఎన్నాళ్ళుండాలి సార్?"

"ఏం కాలేదు లెండి. తొందర్లోనే బాగవుతుంది. మీకు చెప్పాం కదా! శరీరం కండీషన్లో కొస్తూనే ఆపరేషన్ చేస్తాం. తర్వాత రెండు మూడ్రోజుల్లో మీరువెళ్ళొచ్చు. ఆపరేషన్ చేయడానికి బాడీ కండీషన్‌లో లేదు. నార్మల్‌కు రావాలి – వస్తుంది లెండి"

డాక్టరూ, అతను వెంట వచ్చిన మనిషీ వెళ్ళిపోయినారు. నర్సు అవీ, ఇవీ సర్ది వెళ్ళిపోయింది.

ఇప్పుడు డాక్టర్ చెప్పిన మాటల్లాంటివే – మొదటి రోజు ఆస్పత్రిలో చేర్చుకున్న తర్వాత ఇంకో డాక్టర్ చెప్పినాడు – అప్పుడు ఏమనిందీ అర్థం కాలేదు. ఆస్పత్రిలో చేర్చుకున్నాంక అన్నీ వాళ్ళు చూసుకుంటారుతే అనుకున్నాడు.

రాంరెడ్డికి ఇప్పుడర్థమయింది. – తన తండ్రికి ఆపరేషన్ చేయడానికి ఇప్పుడున్న స్థితిలో కుదర్దు. ముందు ఆ శరీరాన్ని మామూలు స్థితికి తెచ్చి, లోపల యంత్రాలన్నీ సరిగా పనిచేసేటప్పుడు ఆపరేషన్ చేస్తారు.

ఆ శరీరం మామూలు స్థితికి రావడానికి ఎన్నాళ్ళు పడుతుందో! – ఎప్పుడు ఆపరేషన్ జరుగుతుందో! – అంతదాకా ఎంత డబ్బో?

తను నర్సును, డాక్టర్‌ను పిలవకుండా వుండి వుంటే!... తండ్రి చచ్చిపోయ్యేవాడు – చచ్చిపోయుంటే బాగుండు... తను నర్సును పిలకుండా వుండింటే బాగుండు.